

**-విమలా రామం**

"నేనీ రాత్రి బండికి వెళ్ళిపోదా మనుకుంటున్నానండి" అన్నాడు రాజశేఖరం.

"అప్పుడే ఎలా వెడతారు! ఇంకా నాలుగు మెతుకులయినా ఒంటపట్టిందే? ఏదో జ్వరం తగ్గింది కదా—లేచి తిరగ గల ననుకుంటున్నారు కాని, ఎక్కడ లేని నిస్సత్తువ ఇప్పుడే వచ్చి పడుతుంది. ఇంకో రెండు రోజు లాగి విశ్రాంతి తీసుకున్నారంటే మీరు మళ్ళీ మామూలు మనిషవుతారు. నా మాట వినండి." చంటిపిల్లవాడిని బుజ్జగిస్తున్నట్లు నచ్చ చెప్పాడు కుటుంబరావు.

"ఇంకా ఎన్నా ళ్ళుండనండి! అప్పుడే వారం రోజులు దాటింది." ఇబ్బందిగా ముఖం పెట్టాడు .రాజశేఖరం.

"పెద్ద సంసారం కదండి! కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. అప్పటికీ అమ్మాయిని ..."

చటుక్కున మంచంపైన లేచి కూర్చున్నాడు రాజశేఖరం. "నన్నపార్థం చేసుకోకండి, మాస్టారూ! ఇక్కడ నా కేదో ఇబ్బందిగా ఉందని నేను వెళ్ళిపోతా ననటం లేదు. చుట్టమై చూడవచ్చి దెయ్యమై పట్టుకున్నాడని ... ఏదో స్కూలు పని మీద వచ్చినవాడిని హఠాత్తుగా రోగం వచ్చి పడిపోయాను. ఈ ఊళ్లో మీరే లేకపోతే ఈపాటికి నే నేమై పోయేవాడినో! ఇబ్బం దనేది ఉంటే అది నా వల్ల మీకే ఉండాలి... ఇంక మీకు శ్రమ ఇవ్వకూడదనే నేను వెళ్ళిపోవా లనుకుంటున్నాను."

"భలేవారండి! మాకు శ్రమగా ఉందని ఎవరు చెప్పారు? ఒకవేళ నేనే మీ ఊరు వచ్చి రోగంతో పడిపోతే నన్ను మీ రాదుకోరా? మీరు మరీ మొహమాటపడుతున్నారు కాని, మనిషికి

మనిషిగా ఈమాత్రం సాయం ఎవరయినా చేస్తారు.''

''అవును. మంచివాళ్లకి లోకమంతా మంచిగానే కనిపిస్తుంది.'' రాజశేఖరం కళ్లు కృతజ్ఞతని వర్షిస్తున్నాయి.

''ఏ జాతి వా జాతి గుర్తిస్తుంది.'' కుటుంబరావు గలగల నవ్వాడు.

రాజశేఖరం చిరునవ్వు నిండుగా, నిర్మలంగా ఉంది.

''అమ్మాయి ఆఫీసునుంచి వచ్చే వేళ అయింది. మీరు మరీ ఒంటరితనంతో బాధపడతారని కాసేపు కూర్చుందామని వచ్చాను ... కొంచెం మార్కెట్లో పని ఉంది'' అని లేవబోయాడు కుటుంబరావు.

''అయితే తప్పదంటారు ...''

''నేను మీ కింక ఏం చెప్పను! అమ్మాయిని ఒప్పించి వెళ్లండి ... అదిగో, వచ్చినట్లుంది.''

అప్పుడే లోపలికి అడుగు పెట్టింది సుశీల. చిరునవ్వు ఆమె కొంగు పెట్టని సొమ్ము. ''ఈ పూట ఎలా ఉంది, నాన్నా, మాస్టారికి?''

''అర్జెంటుగా ఆరు మైళ్లు పరుగెత్తే సత్తువ వచ్చిం దనుకుంటున్నారమ్మా! ఈ రాత్రికే బండెక్కేద్దామని ఆయన ఉద్దేశ్యం.''

రాజశేఖరం ఒంటిమీద చెయ్యివేసి చూసింది సుశీల. ''జ్వరం ఇంక లేదనుకో. అయినా, మామూలు మనిషి కాందే — అప్పుడే ఎలా వెడతారు? ఒక్క పూట పథ్యం తింటేనే ఒళ్లొస్తుందా?''

''నేను చెపితే మీరు వినలేదు. సరే, ఇప్పు డమ్మాయికి ఏమని జవాబు చెపుతారో మీ ఇష్టం. నే వలా వెళ్లొస్తాను.'' అదే చిరునవ్వుతో కుటుంబరావు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

రాజశేఖరం వైపు చూసి సుశీల నవ్వింది. 'ఆమె కళ్లలో ఎంత వాత్సల్యం' అనుకున్నాడు అతను.

''ఇక్కడ ఎన్నాళ్లున్నా రోగం తగ్గినట్లుండదు. సేవ చేసేవాళ్లంటే రోగమంత హాయి లేదట.''

అతని అర్థోక్తి నర్థం చేసుకొని నవ్వింది సుశీల. ''అలాగని అస్తమానం అనుకుంటే ఆ రోగమే భయపడి పారిపోతుంది.''

''మీలాంటి మనుష్యులు ఎక్కడా ఉండరు.'' అతని చూపులు గుండెల్లోకి దూసుకుపోతున్న ట్లున్నాయి.

''ఏం, అంత విచిత్ర జంతువులా ఉన్నానా?''

''చక్కగా నవ్వటం కూడా అందరికీ చేతకాదు.''

ఆమె బుగ్గలు అరుణ వర్ణం రంగరించుకున్నాయి. అతని కళ్లలో వింత హొరతులు వెలుగుతున్నాయి.

''అలా వరండాలో కూర్చుందురు గాని లేవండి. పైరుగాలి తగిలితే ఒంటికి మంచిది.''

''మాటాడి ఒప్పించటం, చటుక్కున మాట తప్పించటం ఆడవాళ్లకే చేతనవును. ఈ విద్య ఏ బళ్లో నేర్చుకున్నారో మరి!''

ఆమె అందమైన మందహాసం అతని ప్రశ్నకి జవాబు. ఆమె లేచి వెళ్లి వాలుకుర్చీ వరండాలో వేసింది.

''లేచి రాగలరా?''

''నన్ను మరీ రోగిష్టివాడిగా కట్టేస్తున్నారు మీరు!''

''ఒక వేళ బాగా బలం చేకూరిందన్న భ్రమలో ఉన్నారేమోనని.''

''మీ ముందు నిలబడే శక్తి నాకెక్కడిది!''

''రెండు రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే ఎంత శక్తయినా వస్తుంది.''

''ప్చ్! లాభం లేదు. ఆడవాళ్లతో మాట్లాడి నెగ్గుకురావటం మగవాడి తరం కాదు. ఈ సబ్జెక్టు మీద ఎక్కడయినా ట్రెయినింగ్ ఉంటే బాగుండును.''

''జీవితాన్ని మించిన పాఠశాల మరొకటి లేదు. ఒక్క క్షణం ఉండండి. ఇప్పుడే వస్తాను'' అని లోపలికి వెళ్లింది సుశీల.

'అబ్బ, ఈమె సమక్షంలో రోజులెంత త్వరగా గడిచిపోతున్నాయి' అనుకున్నా డతను. 'దీని సొమ్మేం పోయిందని? అప్పుడే రోగం తగ్గిపోవాలా? పథ్యం తిన్నాక ఇంకా ఏ వంక పెట్టుకొని ఇక్క డుండగలను?'

'ఎక్కడినుంచో వచ్చి జ్వరంతో పడిపోయానని నాతో ఇంత చనువుగా ఉంటూందా? లేక నా గురించి ఆమెలో కూడా ఏ ఆలోచన అయినా చెలరేగుతున్నాయా? ఆడపిల్ల మనస్సు అంతు తెలియని అగాధం. తలుచుకుంటే ఆ అగాధాన్ని దాటించనూ గలదు. ఇష్టం లేకపోతే మరొక అగాధంలో త్రోసి వేయనూ కలదు! ఇంతకీ సుశీల ఆంతర్యమేమిటో అర్థం కావటం లేదు.' తనలో తను మాట్లాడుకుంటున్నాడు రాజశేఖరం.

''మీలో మీరే మాట్లాడుకుంటున్నారు. బళ్లో పాఠాలు కాని వల్లెవేసుకుంటున్నారా?'' చేత కాఫీ గ్లాసుతో వచ్చింది సుశీల.

ఒక్క క్షణం ఆమె కళ్లలోకి చూసి, ''అవును, జీవితమనే పాఠశాలలో ఎన్ని సార్లు వల్లెవేసుకున్నా పాసు మార్కులు

ఒక్కొకర్ని చూడగానే హృదయం రసప్లావితం అవుతుంది. ఆత్మీయత కలుగుతుంది. ఏ పూర్వజన్మ సుకృతంవల్లనో కలిశాం అనుకుంటాం. కాని, అకస్మాత్తుగా విడిపోవలసివస్తే, ఇద్దరి హృదయాలు శూన్యం అవుతాయి. ఇది నిజం.

రావటమే కష్టం!'' అన్నాడు రాజశేఖరం.

''బహుశా రాంగ్ సబ్జెక్టు తీసుకున్నారేమో మీరు!'' చమత్కారానికి తోడు చక్కని చిరునవ్వు ఆమెని పుత్తడి బొమ్మను చేసి పెట్టింది.

''ఫలానా సబ్జెక్టు తీసుకోవాలని ఆంక్ష లెవరూ పెట్టరు. ప్రశ్నావళి మరీ కఠినంగా ఉంటే స్టూడెంటు తికమక పడిపోతాడు. పంతులమ్మ దయ తలచకపోతే ఆ స్టూడెంటు గతేమిటి? ఇంక పాసు మార్కులు ఎలా వస్తాయి!''

అంతవరకుచిందులు వేస్తున్నచిరునవ్వు ఆమె పెదవుల్ని ఒంటరిగా వదిలిపెట్టి పోయింది. అతని చూపుల తూపుల్నించి ఆమె కళ్లు తప్పించుకొని ఆంతర్యంలోకి చూసుకుంటున్నాయి. ఆర్ద్రంగా నిండుకుంటున్నాయి.

''సుశీలా!''

ఆ పిలుపు ఆమె అణువణువులోను స్పందించింది. చటుక్కున తలఎత్తింది. 'మా ... స్టా ... రూ!' తనలో తను గొణుక్కుంది.

''అర్థం కానంత అసందర్భంగా ఉన్నాయా నా మాటలు?''

''కాదు. అర్థం చేసుకున్నా అన్వయించుకునే స్థితిలో లేను నేను.'' చీర కుచ్చెళ్లలో అటు ఇటు కదులుతున్న బొటనవేలు వైపు చూసుకుంటూంది ఆమె.

''అత్యాశకు పోతున్నానా నేను?''

''లేదు. అంత అదృష్టం భరించే స్థితిలో లేను నేను.''

''ఎవరిని వారుగా చూసుకుంటే అన్నీ అనుమానాలుగా మిగిలిపోతాయి. అర్థం చేసుకుంటే అంతా ఒక్కటయిపోతుంది. ఇదే జీవితం!''

''నే నాడపిల్లని. ఇంతకంటే ఎలా చెప్పాలో నాకు తెలియదు.''

''అవును. అందుకనే నేను ముందడుగు వేశాను. ఆలోచించటం మొదలుపెడితే అన్నీ అర్థమవుతాయి. నా మాటలు నాలుగు వినండి. తరవాతనే మీ అభిప్రాయం చెప్పండి. నా గురించి మీ నాన్న గారికి బాగా తెలుసు. నేను అందలమెక్కే అపురూపమైన వ్యక్తిని కాను. నా కోరికలకు మా పెద్దవాళ్లడ్డురారు. ఇంక మీ మనస్సు కిష్టంలేని పని మీ నాన్న గారు చేస్తారని నే ననుకోను. ఈ వారం రోజులుగా చూస్తున్నాను... మీరంటే మీ నాన్నగారి కెంత అభిమానమో! నే నిక్కడ ఈ స్థితిలో ఉండటం మీ అమ్మగారికి కూడా అయిష్టం అనుకోను. ఒక పరాయి వ్యక్తినే కనుసన్నల్లో పెట్టుకుని కాపాడే మీరు మీ జీవితాలలోకి నడిచి రాగలిగే వ్యక్తిని సుఖపెట్టకుండా ఉంటారా? ఇంత వరకు అన్వయించుకుంటే ఈ సమస్య కంతకీ పరిష్కారం మీ చేతుల్లో ఉందనిపిస్తోంది.''

''మాస్టారూ!''

''అవును, సుశీలా! మొన్నటిదాకా మీరెవరో, నేనెవరో! అసలు ఇటువంటి అపురూపమైన స్త్రీ ఒకచోట పుట్టి పెరుగుతోందని నేను ఊహించనయినా లేదు. ఈ వయస్సులో ఊహాలే అందంగా ఉంటాయి. ఇక ఊహను మించిన వాస్తవం ఎంత అదృష్టం ఉంటే వరిస్తుంది!''

''నన్ను ... నన్ను ఆలోచించుకోనివ్వండి.''

ఎనలేని సంతృప్తి అతని గుండెల్లో నిండింది. గొంతులో తొణికింది. ''తప్పకుండా! ఇక ఆలోచించవలసిందే మీరు. అర్థం చేసుకోవలసిందే మీరు. నా కే సందేహాలూ లేవు. నే నింక ఆలోచించవలసిందేమీ లేదు.''

గాలి తాకిడికి తట్టుకోలేని చిగురుటాకులా రెపరెపలాడింది ఆమె. కన్నుల నిండా నీళ్లతో హిమబిందువులతో తడిసిన పారిజాతంలా ఉంది ఆమె ముఖం. అక్క డొక క్షణం కూడా నిలబడలేక పోయింది ఆమె.

హాయిగా నిట్టూర్చాడు రాజశేఖరం! 'ఆమె ఒక నిర్ణయానికి రావటానికి ఆట్టేసేపు పట్టదు. ఆ అదృష్టం అనుభవించటం ఎంతో దూరం లేదు!' అనుకున్నాడు అతను.

కుటుంబరావు వచ్చేవరకు ఆమె జాడ లేదు. ఆ తరవాతయినా అతని చూపుల్ని తప్పించుకుంటూ తిరిగింది. సిగ్గుపడుతూం దనుకున్నా డతను. ఆలోచించుకుంటూం దనుకున్నా డతను. ఆమె దూరదూరంగా ఉంటూన్న కొద్దీ అది త్వరగా దగ్గర కావటానికే వని పరిపెట్టుకొన్నా డతను.

అయితే, మరునాడు ఉదయం ఆఫీసుకు వెడుతూ కూడా చెప్పకుండా వెళ్లిపోయేసరికి అతని మనస్సు చివుక్కుమంది. ఇష్టమున్న వ్యక్తి, ఇష్టం చేసుకుందా మనుకున్న వ్యక్తి ఇంత కఠినంగా ప్రవర్తిస్తుందా? అయితే, తనంటే ఇష్టం లేదా? ఇంతవరకు తనపరంగా ఆలోచించాడే కాని, ఆమె ఇష్టాయిష్టాలు తెలుసుకోలేదే? పరిపరి విధాల పోయింది అతని మనస్సు. సాయంత్రం వరకు క్షణ మొక యుగంలా గడిపాడు. లేనిపోని నిస్సత్తువ ఒళ్లంతా కళ్ళు చేసుకుంది. ఆమె శుశ్రూషలో ఇంతవరకు రోగమున్నట్లే అనిపించని తనకు ఇప్పుడు లోకంలోని బాధలన్నీ తలమీద వాలినట్లనిపిస్తూంది. మధ్యాహ్నం కుటుంబరావు కాని, సుశీల తల్లి కాని పలకరించ వచ్చినప్పుడు అతడీ ఆలోచనలతో మనసిచ్చి మాట్లాడలేక పోయాడు. తానెందు కలా అయిపోయాడో చెప్పలేక పోయాడు.

చీకటి పడ్డాక కాని రాలేదు సుశీల. కావాలనే ఆలస్యం చేసిం దనుకున్నా డతను. కుటుంబరావు ఏదో మాట్లాడుతుంటే ముక్తసరిగా జవాబు చెపుతున్నాడే కాని, అతని దృష్టి అంతా గుమ్మంలో నిలబడే సుశీల ఊహా శిల్పం మీదనే ఉంది.

"ఇంత ఆలస్యమైం దేమమ్మా?"

రాజశేఖరం చూపుల్ని తప్పించుకుంటూ "అర్జెంటు లెటర్సు టైపు చేయవలసి వస్తేను" అని నసిగింది.

"ఇంకా ఈయన నీరసంగానే ఉన్నారు. డాక్టరు దగ్గరికి వెళ్లివస్తానమ్మా!"

"వద్దులెండి, మాస్టారూ! మందుకు మించిన బలం మనిషి మాటలో ఉంటుంది." రాజశేఖరం తన్నే ఉద్దేశించి అన్నాడని గ్రహించింది సుశీల.

"నువ్వు వెళ్లిరా, నాన్నా! నేను మాట్లాడుతూ ఉంటాను."

కుటుంబరావు తల పంకించి వెళ్లిపోయాడు. కొన్ని నిమిషాలు ఇద్దరి మధ్య భయంకరమైన నిశ్శబ్దం విలయ తాండవం చేసింది.

ఇంక భరించలేకపోయాడు రాజశేఖరం. "నన్ను క్షమించండి, సుశీలా! ఒక్క వారం రోజుల పరిచయంతో మీ రిచ్చిన చనువుని దుర్వినియోగం చేసుకున్నాను. ఎంతసేపూ నా దృష్టితోనే ఆలోచించాను. నా గురించి ఆలోచించమని ఆంక్షలుపెట్టే హక్కు నాకెక్కడిది! మీకూ కొన్ని కోరిక లుంటాయని, మీకూ వేరు ఆలోచన లుంటాయని అర్థం చేసుకోలేకపోయాను. మీ మనస్సు మీద నా భావాలు రుద్దాలని అవివేకంగా ప్రయత్నించాను."



పాలబుగ్గలు
కె. గజేన్ద్రన్ మద్రాసు-17

ఆమె దించిన తల ఎత్తలేదు. "మిమ్మల్ని మీరు న్యూనతపరుచుకుంటూంటే భరించే శక్తి నాకు లేదు. మీ రూహించుకుంటున్న కోరికలు నాలో ఏమీ లేవు. మీ రనుమానిస్తున్న ఊహలు నాలో ఏమీ లేవు. కాని, నే నేమనుకుంటున్నానో, ఎందుకు కాదంటున్నానో చెప్పలేకపోతున్నాను. అదే నా దురదృష్టం! దయ ఉంచి నన్ను గర్విష్ఠిగా మాత్రం భావించకండి."

"పోనీ, ఆ అదృష్టవంతు డెవరో తెలుసుకోవచ్చా?" అణిచిపెట్టలేని ఆవేశం అతని గొంతులో పొంగుతూంది.

ఒక్క క్షణం తలఎత్తి అతని వైపు చూసింది సుశీల. "నేను మామూలు ఆడపిల్లని. నన్నొక అపురూపమైన వ్యక్తిగా మీ రూహించారు. దానికి నే నేం చేయగలను?"

"అంటే, అందుతుందన్న అదృష్టం ఎందుకు జారిపోతోందో తెలుసుకునే అర్హతయినా నాకు లేదా?"

"ఎంత స్పష్టంగా చెపుదామన్నా నాకు మాటలు చేతనవటం లేదు. మిమ్మల్ని బాధపెట్టాలని మాత్రం నాకు లేదు. అది మాత్రం నమ్మండి."

"పోనీ, ఎప్పుడు మీ మనస్సు మారుతుందో చెప్పగలరా?"

"చెప్పలేను. కొన్నేళ్లు పట్టవచ్చు. ఒక వేళ ఈ జీవితాని కది అసాధ్యమయినా ఆశ్చర్యం లేదు."

"అంటే, అసలు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యమే లేదా మీకు?" ఆశ్చర్యంతో తలమునక లయిపోయాడు రాజశేఖరం.

చటుక్కున జారుతున్న కన్నీటిని ఒత్తుకుంది ఆమె. అంతలోనే పేలవంగా నవ్వింది. "మీ ప్రశ్నల కేమని జవాబు చెప్పను? ఆ ఉద్దేశ్యం ఉందంటే మరి ఈ సమస్య నెందుకు పరిష్కరించరు అని అడుగుతారు. లేదంటే కారణ మేమిటని అడుగుతారు. పెళ్లి వద్దన్న ఆడపిల్ల ఎప్పుడూ కాలాతీత వ్యక్తిగానే కనిపిస్తుంది. నన్ను నేనే తెలుసుకోలేని స్థితిలో ఉన్నాను. నా గురించి మీ కేం చెప్పగలను?"

ఏదో అర్థమైనట్లు గొంతు సవరించుకున్నా డతను. "అయితే, మీవన్నీ ఒట్టి భయాలన్న మాట."

"కాదు. నిజాలు." ఆమె గొంతు వణికింది.

"పోనీ, మీ నాన్నగారికి, అమ్మగారికి తెలుసా?"

"తెలుసు ... తెలియదు. నిజం మనకు తెలుస్తుంది. కాని, తెలియనట్లు నటిస్తూంటాం. అదే జీవిత సమరం."

"ఇంతవరకు వచ్చింది కనక నన్నూ ఒక తెలిసిన నిజాన్ని చెప్పనివ్వండి. నే నింత ధైర్యంగా నా కోరిక బయట పెట్టుకోవటానికి కారణం నేను మాత్రమే కాదు, మీ నాన్నగారు కూడా! ఆయన ప్రత్యక్షంగా చెప్పకపోయినా హెడ్మాస్టారి ద్వారా అడిగించారు. అందుకనే మీ రింత సేపు నాతో మాట్లాడటానికి, నా రోగం గురించి పట్టించుకోవడానికి ఏమాత్రం అడ్డు చెప్పటం లేదు. మీ కీ విషయం పెద్దవాళ్లు చెప్పటం వలననే మీ రింత చనువిచ్చి నాతో మాట్లాడుతున్నా రనుకున్నాను. కాని, సహజంగా మీలోనే ఈ కలుపుగోలు స్వభావం ఉందని గుర్తించలేకపోయాను. అందుకనే నా అంతట నేనే ముందడుగు వేశాను. అదే నా పొరపాటయితే నన్ను క్షమించండి. నే నేవిధంగా నయినా హద్దుమీరి ప్రవర్తించినట్లు మీ కనిపిస్తే నన్నుమాత్రం అసహ్యించుకోకండి. మనసు లేని మనిషిని మాత్రం కాను."

ఇంక అక్కడ నిలబడలేకపోయింది సుశీల. చటుక్కున పైకి లేచింది. కనుమూసి తెరిచేలోపల ఆమె ముంజేతిని పట్టుకున్నా డతను. ఆమె చకిత నయనాలు తడి తడిగా ఉన్నాయి. కందిన బుగ్గలు కంటి ఎరుపుతో పోటీ పడుతున్నాయి. ఎంత తొందరగా ఆ వేళ్లను తాకిందో అంత తొందరగానూ అతని చేయి విడిపోయింది. "క్షమించండి, నే నింక ఇక్కడ ఉండలేను. పొద్దున్నే వెళ్లిపోతాను. ఇదే మీ ఆఖరి దర్శనమయితే ... ఇంక సెలవు."

ఒక్కసారి పిచ్చిదానిలా అతనివైపు చూసింది సుశీల.

"మరొక్క మాట చెప్పనివ్వండి. ఏదో ఒక రోజున మీ నాన్నగారు నా అభిప్రాయం కోసం వచ్చే అవకాశం రానివ్వకండి. మీ రనుకుంటున్న దేమిటో నేను చెప్పలేను. నా కిష్టంలేదని చెప్పి నన్ను నేను ఆత్మ వంచన చేసుకోలేను. ఒకవేళ ఆ అవకాశం మీకే వస్తే నా జీవితంలోకి నడిచిరావటానికి మీకే ఇష్టంలేదని చెప్పెయ్యండి. నన్ను రక్షించండి."

ఆ ఆఘాతానికి తట్టుకోలేకపోయింది ఆమె. మరుక్షణంలో తన కేమయిపోతుందోనని విలవిలలాడిపోయింది. పొంగి వస్తున్న దుఃఖంతో వడివడిగా లోపలికి అడుగులు వేసింది.

అత నక్కడే నిస్ప్రాణగా, నిర్వీర్యుడై నిలబడిపోయాడు.

• • •

నిరాశతో నిండిన హృదయం నిద్రకు తావిచ్చింది కాదు. రాత్రంతా అతనికి జాగరణే అయింది. ఎప్పుడో తెల్లవారు ఝామున కొంచెం కునుకు పట్టింది. మెలకువ వచ్చేసరికి బారెడు ప్రొద్దు పైకెక్కింది. చటుక్కున మంచంపై లేచి కూర్చున్నాడు రాజశేఖరం.

అతని కళ్ళు ఆశగా వెతుకుతున్నాయి. ఆమె వచ్చే జాడ కనిపించలేదు. అతను లేవటం చూసి సుశీల చెల్లెలు వేడినీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఎక్కడలేని నిస్సత్తువ ముంచెత్తుకు వచ్చింది. ఎలాగో లేచి ముఖం కడుక్కున్నాడు. ఇచ్చిన కాఫీ ఎంగిలిపడ్డాడు.

'ఇన్నాళ్ళు ఆదరించిన వాళ్ళు ఇంక వెళ్లిపొమ్మంటున్న ట్లున్నారు' అనిపించిం దతనికి. కన్నీళ్ళపర్యంత మయింది. ఒక్క కోపం అతని అణువణువునూ రగిల్చింది. బండి కింక ఆరుగంటే [illegible] వెళిపోవాలనుకున్నా డతను. తన బట్టలు అక్కడ సిద్ధంగానే ఉన్నాయి. శుభ్రంగా [illegible]

అతను ప్రయాణ మయ్యాడు. కుటుంబరావు ఇంట్లో లేడు. అతని హడావిడి చూసి సుశీల తల్లి తెల్లబోయింది.

"నేను వెళ్ళివస్తానండి. మాస్టారు రాగానే చెప్పండి."

"అప్పుడే వెళ్లిపోతారా? మీరు వెడుతున్నారని ఆయన చెప్పనయినా లేదు. ఇంకా నీరసంగా ఉన్నారని, డాక్టరు మందిచ్చారని అంటే రెండు మూడు రోజులుంటా రనుకున్నాను. అమ్మాయికూడా ఆఫీసులో పని ఉందని ప్రొద్దున్నే వెళ్ళిపోయింది. పోనీ, భోజనంచేసి మళ్లా బండికి ..." సుశీల తల్లి ఇంకా ఏదో చెప్పబోయింది.

"మళ్లీ త్వరలోనే వస్తాలెండి, మీ సహాయానికి..."

"దానికేముంది, బాబూ! తల్లిలాంటి దాన్ని."

ఇంక కన్నీళ్ళు పొంగి వచ్చేలా ఉన్నాయి. అతడు తడబడుతూ బయటికి అడుగులు వేశాడు. సుశీల చెల్లెలు వెనకాలే పరుగున వచ్చింది. "మాస్టారూ! అక్క మీ కీ కవరు ఇమ్మంది." అప్పటివరకు మినుకు మినుకు మంటున్న ఆశాజ్యోతి చటుక్కున ఒక్క వెలుగు వెలిగింది. గుండెలు చేతపట్టుకుని ఆ కవరు తెరిచాడు అతను. లోపల మరొక్క కవరు ఉంది. దాని మీద 'దయ ఉంచి మీరు రైలెక్కే వరకు ఈ కవరు తెరవకండి' అని ఉంది' ముత్యాల సరాలు ఎంత విషాదాన్ని నింపుకున్నాయి!

చటుక్కున ఆ కవరు జేబులో పెట్టుకున్నాడు అతను. "కవరు తీసుకున్నానని మీ అక్కతో చెప్పు." ఆ పిల్ల తల పంకించింది.

అతను వడివడిగా స్టేషన్ వైపు అడుగులు వేశాడు. దాహంతో గొంతు ఎండిపోతున్న వాడికి చక్కటి కోనేరు దర్శనమైనట్లుం దతనికి. నాలుగు అడుగులయినా వేయగలనో లేదో అని భయపడ్డ వాడికి స్టేషన్ దాకా నడిచి వెళ్ళగలిగే శక్తి ప్రసాదించింది ఆమె ఇచ్చిన కవరు.

రైలు రావటానికి అయిదు నిమిషాల వ్యవధి ఉంది. ఆమె తీసుకున్న మాట కోసం అతను మూడు వందల యుగాలు అతి ఓర్పుతో గడిపాడు.

రైలు ఎక్కిన వెంటనే కిటికీ దగ్గరగా ఒంటరిగా ఉన్న సీటు చూసుకొని కూర్చున్నాడు. జేబులోంచి కవరు తీసి, అందులోని కాగితాలు తెరుస్తుంటే అతని చేతులు వణికాయి. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆపుకోలేని ఉద్వేగం కన్నుల్లో తొణికిసలాడింది.

> మధుపు తాగిన మనిషికే నిషా ఇస్తుంది. కానీ, సౌందర్యం అలా కాదు. అది ఉన్నవారికి, దాన్ని చూచేవారికీ నిషా కలిగిస్తుంది. మధువు ఇచ్చే నిషాకన్న, అందం ఇచ్చే నిషా ప్రమాదకరమైంది.
>
> —జిమ్మర్‌మాన్

అది ఆమె వ్రాసిన ఉత్తరం. అక్కడక్కడ తడి మరకలు ఆమె హృదయాన్ని విడమరిచి చెబుతున్నాయి.

"శ్రీ రాజశేఖర్ —

మా ఊరు వచ్చి శారీరకంగా ఆరోగ్యవంతులయిన మిమ్మల్ని ఆదుకోలేదు సరికదా, మానసికంగా కూడా అనారోగ్యం పాల్జేసి వీడ్కోలు చెపుతున్నాను. అందుకు నన్ను క్షమించండి.

మరే పరిస్థితులలో నయినా అయితే మిమ్మల్ని అనారోగ్యంతో వెళ్లనిచ్చేదాన్ని కాదు. ఈ పాపభారాన్ని మోసేదాన్ని కాదు. నా కుటుంబంకోసం, నా స్వార్థం కోసం మిమ్మల్నీ స్థితిలో వెళ్లనివ్వక తప్పలేదు. మిమ్మల్ని బాధపెట్టక తప్పలేదు.

మీ రిలా హఠాత్తుగా వెళ్లిపోతున్నందుకు ఎంత కుమిలిపోతున్నానో, అంత సంతృప్తిపడుతున్నాను. ఒకే సందర్భం ఆనందానికీ, దుఃఖానికీ కూడా కారణం అవుతుందని నే నెక్కడా వినలేదు, ఊహించలేదు. కాని, అది నా విషయంలోనే అనుభవ మవుతుంటే ఆశ్చర్యపోతున్నాను; అర్థం చేసుకోలేక పోతున్నాను.

మీరు నావన్నీ భ్రమ లనుకున్నారు. కాని, అవన్నీ నిజాలని నే నన్నాను. మరి నిజం చెప్పటానికి భయమెందుకు అని మీ రడగవచ్చు. నేను మీకంటే చాలా చిన్నదాన్ని. చదువులోను, తెలివితేటలలోను, లోకానుభవంలోను— అన్నిటిలోను మీకంటె చిన్నదాన్ని. అయినా, మీ రూహించని ఒక నిజం చెబుతాను. అసలు నిజం చెప్పటానికే మనిషి భయపడతాడు. అబద్ధం చెప్పగలిగినంత నిర్భయంగా నిజం చెప్పలేడు మనిషి. అదే నేను ఈ స్వల్పానుభవంతో నేర్చుకున్నది. నా ఈ మాటలు మీకు వింతగా ఉండవచ్చు. నా మాటలు మరికొన్ని చదవండి. [illegible] మన్నా నేను సిద్ధమే.

నే నిందులో చెప్పబోయే నిజాన్ని [illegible] న్నాను.

మా నాన్నగారు హెడ్మాస్టారి ద్వారా అడిగించారని మీరు చెప్పారు. అయితే, మా గురించి మీ కన్నీ తెలిశాయా? తెలిసి ఉండవు. ఎందుకంటే, అన్నీ చెప్పుకునే ధైర్యం మా నాన్నగారికి లేదు. వాస్తవంగా ఇటువంటి విషయాలు చెప్పుకునే ధైర్యం మన సంఘంలో ఎవరికీ లేదు.

అర్థాకలితో తక్కినవాళ్ళందర్నీ పెంచి ఉన్నదంతా ఊడ్చిపెట్టి అన్నయ్యకు ఇంజినీరింగ్ చెప్పించారు నాన్నగారు. చిన్నప్పటి నుంచి మేమంటే ప్రాణమిచ్చే అన్నయ్య ఉద్యోగం వచ్చిన కొత్తలో హఠాత్తుగా మారిపోయాడు. వర్ణాంతర వివాహం చేసుకొని మా నుంచి విడిపోయాడు. ఇప్పుడు మా కొక అన్నయ్య ఉండేవాడు అన్నది ఒక కలగా మాత్రం మిగిలిపోయింది. గత జీవితమంతా ఒక కథగామాత్రం గుర్తుంది.

ఒకనాడు సంధ్యవేళ కొత్త పెళ్లికూతుర్ని తీసుకొని ఇంటికి వచ్చాడు అన్నయ్య. విషయం తెలుసుకొని భగ్గుమని మండిపోయారు నాన్నగారు. అమ్మ బతిమాలుకుంటున్నా వినకుండా అన్నయ్యను భార్యతో సహా ఇల్లు వెడలనడిపారు.

కాలం మారిపోయింది. కాని, మన మింకా మారలేదు. మన చుట్టూ ఉన్న మనసు లింకా మారలేదు. ఆ మార్పు వచ్చేవరకు మన పరిస్థితులు మారవు.

సంఘ సంస్కరణ చెయ్యాలని చెప్పేవారు కోకొల్లలు. తీరా ధైర్యంచేసి సంస్కరించేవాడుంటే వాడిని వెలివేస్తారు. వందేళ్ళ చరిత్ర చెపుతూంది — మన సంఘం మారలేదని, మారినట్లు మాత్రం నటిస్తున్నదని. అందుకనే మా నాన్నగారు భయపడ్డారు. అన్నయ్యను ఆదరిస్తే ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావేమోనని భయపడ్డారు. తోటి వాళ్లంతా వెలివేస్తారని భయపడ్డారు.

అంతేకాదు, ఇలా జరిగిందని అనుకోవటానికి భయపడుతున్నా రాయన. ఆయన భయాలు ఉట్టి భయాలు మాత్రం కావు. అక్కయ్య పెళ్లి చేయటానికి ఆయన పడకూడని అవస్థలన్నీ పడ్డారు. తలకు మించిన బరువు ఎత్తుకుంటే కాని 'వర్ణసంకరం చేసుకున్న వాళ్ళ అమ్మాయి'ని కట్టుకున్నారు కాదు అక్కయ్య అత్తవారు. అక్కయ్యను ఓ ఇంటిదాన్ని చేసే [illegible] ట్లయ్యాయి. ఇంత జరిగాక మనుషులు మారారని, మన దృక్పథం మారిందని ఎలా అనుకోమంటారు? మరో వందేళ్ళ కయినా మన చుట్టూ ఉన్న మనసులు మారతాయంటారా? ఏమో? నా కేమ్మాత్రం ఆశ లేదు.

ఇప్పుడు మా అన్నయ్య గొప్ప ఉద్యోగంలో హాయిగా ఉండి ఉండవచ్చు. కాని, అతడికీ పిల్లలున్నారు. ముందుముందు వాళ్ళ పెళ్లి బాధ్యత మీదికి వస్తుంది. అప్పుడు తన కున్నంత విశాల దృక్పథంతో ముందుకు వచ్చేవారు ఉండవద్దా? ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో, ఎల్లప్పుడూ ఆర్థిక పరిస్థితి ఒక్కలాగునే ఉంటుందన్న భరోసా ఎక్కడుంది? అతణ్ణిమాత్రం ఈ పెళ్ళిళ్ల సమస్య వెంటాడకుండా ఉంటుందా? ఆర్థికంగా నిలబడ్డవారు తప్ప ఈ సంఘ సంస్కరణలను ఎదుర్కొనే ధైర్యవంతు లెక్కడున్నారు? డబ్బున్నవాడి కా ఆలోచన, అవసరం రావు. ఆలోచించి అమలుపరిచే వాడిని ఆర్థిక దుస్థితి వెంటాడుతుంది. ఇదిగో, ఎటూ కాకుండా ఉన్నవాడు ధైర్యంచేస్తే అతడి వల్ల ఆ కుటుంబమంతా కష్టాల పాలవుతుంది.

ఒక ధైర్యవంతుడిని కన్నందుకు మా తండ్రి ఆనందించాలా? లేక తన పరిస్థితి అతడి మూలాన అధోగతి పాలయినందుకు పరితపించాలా? ఇటువంటి స్థితిలో ఉన్న నాన్న గారు మా గురించి అన్ని నిజాలు అందరికీ ఎలా చెప్పగలరు? అందుకనే అన్నీ ఆయన మభ్యపెట్టడం నేర్చుకున్నారు.

'మా అన్నయ్య వర్ణాంతర వివాహం చేసుకుంటే నేనేం అపరాధం చేశాను?' అని అడగటానికి లేదు. నా కాబోయే భర్తకు అది అవమానం. ఆయన చెల్లెళ్లకు మళ్లీ పెద సమస్య. ఒకవేళ చెల్లెళ్ళ బాధ్యత లేకపోతే పుట్టే పిల్లలకు పెళ్ళిళ్ల సమస్య. ఇదంతా ఒక ముళ్లదారి. ఎటువెళ్లినా పాదాలు రుధిరమయమై పోతాయి.

ఈ నిజాలన్నీ తెలిశాక కూడా మీ నిర్మలమైన మనస్సు నిశ్చలంగానే ఉందనుకోండి. అయినా, నా వల్ల మరికొన్ని బాధలు తెచ్చిపెట్టుకున్నట్లవుతుంది మీకు.

మరికొంత స్పష్టంగా చెప్పనివ్వండి. మా అన్నయ్యే అంత ధైర్యం చేయకపోతే మా పరిస్థితు లిలా ఉండేవి కావని నేను చెప్పబోవటం లేదు. జరగకూడనివి జరిగాయని ఎవరినో నేను నిందించబోవటం లేదు. జరగకూడనివి కొన్ని జరగకుండా చూసుకోవటమే నా ఉద్దేశ్యం. అందుకనే ఇంత వివరంగా మీకు చెప్పాలని తాపత్రయపడుతున్నాను.

రక్తమిచ్చి కన్న బిడ్డడిని తన రక్తం ధారపోసి శ్రమించి కూడబెట్టిన ధనంతో అభివృద్ధిలోకి తీసుకువచ్చిన తండ్రికి ఆ బిడ్డడు ఎందుకూ కొరగానివాడయితే అంతకుమించిన బాధమరొకటుంటుందా? అప్పుడు ఎవ్వరూ ఆదుకోకపోతే ఆయ నేమైపోవాలి? ఎవరి మట్టుకు వాళ్ళు తమ దారి చూసుకుంటే తక్కినవాళ్ల గతేమిటి? వాళ్ళ కాధారమైన ఆయన బ్రతికి పది కాలాలపాటు బట్ట కట్టవద్దా? అన్నయ్య తన దారి తను చూసుకున్నాడు. అక్కయ్య తన జీవితంలో స్థిరపడిపోయింది. ఇంకా ఆడపిల్లలం ముగ్గురం. నాకంటె చిన్న వాళ్ళు ముగ్గురు మగపిల్లలు ఎదిగి రావాలి; చదవాలి; అప్పుడు సంపాదన చేయాలి. ఇటువంటి సమయంలో నేను కూడా నా దారి చూసుకుంటే ఆయ నేమైపోవాలి?

రెండవపూట గడవడమే కష్టమవుతున్న రోజుల్లో ఉన్న ఊళ్లో నాకు ఉద్యోగం వచ్చేసరికి ఆయన పొందిన ఆనందానికి అవధి ఉంటుందా?

మొదటి జీతం పట్టుకువచ్చి చేతికిస్తే ఆనందబాష్పాలతో ఆయన ముఖం కందినప్పుడు నిస్తేజమైన ఆ కన్నుల్లో కాంతి ప్రసరింపజేయగలిగినందుకు అప్పుడెంతయినా ఆనందించాను. ఆ ఆనందం శాశ్వత మనుకున్నాను.

'అమ్మయ్య, ఇప్పటికి నా అప్పులు తీరి తల ఎత్తుకో గలనన్న భరోసా వచ్చింది నాకు' అని అమ్మతో ఆయన అన్నప్పుడు ఎంతయినా తృప్తి చెందాను. ఆ తృప్తి ఎనలేని దనిపించింది.

'ఇంకొక్క ఏడాది పోతే ఈ సమస్యలన్నీ పరిష్కార మయిపోతాయి' అని ఆయన అన్నప్పుడు భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాను. అవి తీరని ఆశలు కావనుకున్నాను.

ఇంక నా గురించి ఆయన బాధపడ నక్కరలే దనుకున్నాను. అప్పుడు నా గురించి నేను ఆలోచించుకోవటం ప్రారంభించాను. ఆకాశ హర్మ్యాలు కట్టుకుంటున్న తరుణంలో రెండు పెళ్లి సంబంధాలు వచ్చాయి. చూసుకొని వెళ్లిన వాళ్ళు కుంటిసాకులు చెప్పి తప్పించుకున్నారు. 'ఇది కాకపోతే మరొకటి. ఇప్పుడు కాకపోతే మరొకప్పుడు. మన మేం భయపడ నక్కరలేదు' అని ఆయన అమ్మతో అంటుంటే వాళ్ళు నన్ను తృణీకరించిన దానికంటె ఎక్కువ ఆశ్చర్యపడ్డాను. అక్కయ్య పెళ్లి నిర్ణయమయ్యాక కూడా కంటినిండా నిద్రపోని నాన్నగారు రెండు సంబంధాలు తప్పిపోయాయని తెలిసి కూడా అస లా విషయమే జరగనట్లు ప్రవర్తించసాగారు. ఎందుకని? నే నిప్పుడు ఆయనకో ఆధారం. అది నాకంటే ఆయనే బాగా గుర్తించారు. లేకపోతే అమ్మతో 'కొడుకయినా, కూతురయినా సుశీలే కదే మన కిప్పుడు?' అని ఆయన అని ఉండేవారు కాదు. ఆయన అంతర్యంలో అనుకుంటున్న నిజం అర్థమయితే అమ్మ ఆ మాటలు నాతో చెప్పి ఉండేది కాదు.

క్షమించండి. కన్నతండ్రిమీదనే చాడీలు చెప్పుకునే దుస్థితికి దిగజారలేను. చేదైన నిజం చెపుతున్నప్పుడు ఎంతయినా భయం వేస్తుంది. ఎలా చెప్పాలో తెలిసిరాదు.

నన్ను సుఖపడవద్దని ఆయన అనటం లేదు. తన కష్టాలు గట్టెక్కవేమోనని ఆయన భయపడిపోతున్నారు. చిత్రమైన పరిస్థితి అది! చెప్పుకోలేని దుస్థితి అది! అర్థమయ్యాక కూడా తెలియనట్లు నటించగలనా? నన్ను నేను ఆత్మవంచన చేసుకోనా?

అభిమానం ఎక్కడుంటుందో అక్కడ బాధ్యత పెరుగుతుంది. బంధాలు తెంచుకున్న అన్నయ్య బాధలు తప్పించుకున్నాడు కాని, అన్నీ పట్టించుకునే నేను నాకు నేనుగా ఏమీ చేసుకోలేకపోతున్నాను. అందుకనే నా గురించి ఆలోచించటం మానుకున్నాను.

కాని, అనుకోకుండా హఠాత్తుగా మీరు నా ముందుకు వచ్చి నిలిచారు. నిశ్శబ్దమైన నా మనస్సులో సంచలనం కలిగించారు. నన్ను గుర్తించే ఓ హృదయం ఉందని వెర్రి ఆశలు రేకెత్తించారు. ఒక్క లిప్త కాలంలో నా భవిష్యత్తు మారిపోవచ్చు. మీముందుకు వస్తే నన్ను నేను నిగ్రహించుకోలేకపోవచ్చు. నేను చెప్పవలసినవన్నీ మరిచిపోయి, నేను వినవలసినదానిగా మిగిలిపోతానేమో!

అందుకనే ఇలా భయపడి పారిపోతున్నాను. అందుకనే మీరు అనారోగ్యంతో వెళ్లిపోతున్నా అడ్డు చెప్పలేకపోతున్నాను. ఒకపక్క చేతి కందిన అదృష్టం జారిపోతున్నందుకు దుఃఖం ముంచుకొస్తూంది. వేరొక పక్క స్వీకరించిన బాధ్యత కాళ్లకు బంధాలు వేస్తూంది. మీ ఒక్కొక్క మాట గుర్తుకు వచ్చినప్పుడల్లా నా మనస్సు వికలమైపోతూంది. ఒక్క పరుగులో వచ్చి మీ ముందు వాలదామనిపిస్తూంది. కొన్నేళ్ళ నిగ్రహించుకున్న ఆవేదనను ఒక్క కన్నీటి బొట్టుతో తుడిచి వేయాలనిపిస్తూంది.

కాని, ఈనాటి నా ఆనందం నా తండ్రికి కొన్నేళ్ళ దుఃఖానికి కారణమవుతుందని తెలిసినప్పుడు ఈ ఆనందాన్ని అనుభవించలేను. మళ్లీ ఆయన కళ్ళు నీళ్ళింకి నిస్తేజం కావటం చూడలేను.

'నా కిష్టంలేదని చెప్పి నన్ను నేను ఆత్మవంచన చేసుకోలేను' అని మీ రన్నారు. అటువంటి బాధ పడలేకనే నేను మీ కింతగా చెప్పుకోవలసి వచ్చింది.

'నా జీవితంలోకి నడిచి రావటానికి మీకే ఇష్టంలేదని చెప్పెయ్యండి' అన్న మీ చివరి మాటలు నా గుండెల నెంతగా కోత పెట్టాయో మీకు మాటల్లో చెప్పలేను. వాస్తవంగా ఆ కోరిక కోరవలసింది నేను.

ఈ విషయంలో నాన్నగారు నన్నెప్పుడూ నా ఇష్టం గురించి అడగరు. అడిగితే నే నేం జవాబు చెపుతానో ఆయనకు బాగా తెలుసు. ఇంక అడగవలసివస్తే మిమ్మల్నే అడుగుతారు.

అప్పుడు మాట తప్పించి ఈ మనువు అసంభవమని చెప్పవలసింది మీరు. నన్ను రక్షించవలసింది మీరు. నే నెంతో కఠినురాలినని మీరు భావించకపోతే మీ రలా చెప్పినప్పుడు మా నాన్నగారి కళ్లలో వెలిగే ఆనందం మీ కళ్లతో మీరే చూస్తారన్నది వాస్తవం.

ఈ భయంకరమైన నిజాన్ని నాకు భరించే శక్తి నివ్వండి. 'ఒక హృదయంలో నాకూ చోటుంది' అన్న తృప్తి చాలు నా కీ జీవితానికి.

సెలవు. —సుశీల." ★

